క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే ముదునూరి అందుబాటులో ఉండరు

నరసాపురం: అసెంబ్లీ సమావేశాల వల్ల ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు మంగళవారం అందుబాటులో ఉండరని ఎమ్మెల్యే కార్యాలయం పేర్కొంది. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరింది.

చిత్రలేఖనంలో పాలకొల్లు యువకుడికి ప్రథమం



బ్రహ్మానందం నుంచి అవార్డు అందుకుంటున్న తమ్మిశెట్టి రాకేష్

పాలకొల్లు అర్బన్: సినీ హాస్యనటుడు, పద్మశ్రీ బ్రహ్మానందం పుట్టిన రోజు సందర్భంగా హైదరాబాద్‌లో సాగంటీస్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన పద్మశ్రీ బ్రహ్మానందం ముఖచిత్రం చిత్రలేఖన పోటీల్లో పాలకొల్లు పట్టణం 14వ వార్డుకి చెందిన తమ్మిశెట్టి రాకేష్ ప్రథమ స్థానంలో నిలిచారు. రాకేష్ బ్రహ్మానందం చేతుల మీదుగా షీల్డ్, ప్రశంసాపత్రం అందుకున్నారు. ఆదివారం జరిగిన ఈ పోటీల్లో 332 మంది చిత్ర కళాకారులు పాల్గొన్నారు. బ్రహ్మానందం చేతుల మీదుగా బహుమతి అందుకోవడం ఆనందంగా ఉందని హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న రాకేష్ స్థానిక విలేకరులకు తెలిపారు.

నరసాపురం - హైదరాబాద్‌కు కొత్త బస్సు సర్వీసు

నరసాపురం రూరల్: నరసాపురం నుంచి హైదరాబాద్ వెళ్లే ప్రయాణీకుల కోసం ఏపీఎస్ ఆర్టీసీ నూతన సర్వీస్‌ను ప్రారంభించిందని విజయవాడ ఆర్టీసీ రీజనల్ చైర్మన్ పిన్నింటి మహేష్ తెలిపారు. నరసాపురం బస్ స్టాండ్‌లో రాత్రి 8 గంటలకు ఆయన బస్సును ప్రారంభించారు. నరసాపురం నుంచి వయా మచిలీపట్నం మీదుగా హైదరాబాద్‌కు వెళ్లే బస్ మొగల్తూరు, కాళీపట్నం, బంటుమిల్లి, పెడన, మచిలీపట్నం బైపాస్, పామర్రు, ఉయ్యూరు, కంకిపాడు మీదుగా విజయవాడ, బీహెచ్‌ఈఎల్ వెళుతుందని చెప్పారు. ప్రయాణీకుల సౌకర్యార్థం ఈ రూట్‌లో ఏర్పాటు చేసిన బస్సు సౌకర్యాన్ని ప్రయాణీకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆర్టీసీ యూనియన్ సభ్యులు, ప్రయాణీకులు పాల్గొన్నారు.

మోసపూరిత మాటలు నమ్మొద్దు

మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు



పెనుగొండ : డ్వాక్రా మహిళలకు సత్కరించిన మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు



పెనుగొండ : ఆసరా.. మనసారా కార్యక్రమానికి తరలివస్తున్న డ్వాక్రా మహిళలు

పెనుగొండ: నాడు మహిళలను నిండా ముంచేసిన టీడీపీ అధినేత చంద్రబాబు మాటలకు మోసపోవద్దని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు కోరారు. ఆసరా.. మనసారా సంబరాల్లో భాగంగా ఆచంట నియోజకవర్గం తూర్పుపాలెంలో ఏడో రోజు సోమవారం సుమారు 10 వేల మంది మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు. వారికి ఆత్మీయ విందు ఇచ్చి చీరలు పంపిణీ చేశారు. 2014లో రుణమాఫీ చేస్తానని, బ్యాంకులకు చెల్లించవద్దంటూ చెప్పిన చంద్రబాబు మాటతప్పడం వల్లే మహిళలు ఆర్థికంగా అవస్థలకు గురయ్యారని, రైతు రుణమాఫీ సైతం పాక్షికంగా చేసి ఎగ్గొట్టారని విమర్శించారు. అందుకే ప్రజాసంకల్ప యాత్రలో మహిళలు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మొరపెట్టుకోవడంతో నవరత్నాలు రూపకల్పనతో పాటు, రుణమాఫీ హామీ ఇచ్చి మాట నిలబెట్టుకొన్నారని వివరించారు. దీంతో 2019లో చంద్రముఖిని బంధించగలిగామన్నారు. 2024లోనూ రెండు బటన్‌లు నొక్కి చంద్రముఖి పీడను వదలించుకోవాలని పిలుపునిచ్చారు. ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ మేడపాటి షర్మిలా రెడ్డి మాట్లాడుతూ కష్టకాలంలోనూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు అండగా నిలిచారని వివరించారు. మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు ఆచంట నియోజకవర్గంలో అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ప్రతి గ్రామంలోనూ ప్రభుత్వ, తన సొంత నిధులతో అభివృద్ధి చేయడం చూస్తుంటే.. మరోసారి శ్రీరంగనాథరాజును మంత్రిగా చూడడానికి మహిళలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు కర్రి గౌరి సుభాషిణి, పోడూరి గోవర్ధన, ఆచంట ఏఎంసీ చైర్మన్ చిల్లే లావణ్య, పెనుగొండ మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షురాలు దండు పద్మావతి, ఏపీ వుమెన్ వెల్ఫేర్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ బొక్కా అరుణ, సర్పంచ్‌లు కోట సరోజినీ, దిరిశాల విజయలక్ష్మి, మట్టా కుమారి, చుట్టుగుళ్ల పూర్ణిమ, గణేషుల శేషవేణి గొట్టుముక్కల సోనీయా రాణి, గుబ్బల ఉషారాణి, గుడాల శిరీష, ఇళ్ల చంద్రిక, మామిడిశెట్టి లక్ష్మి, ఎంపీటీసీలు, ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

సేవకురాలిగా పనిచేస్తా
ఎంపీ అభ్యర్థి ఉమాబాల

పాలకొల్లు అర్బన్: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఊహించని అవకాశం తనకు కల్పించారని, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి సేవకురాలిగా పనిచేస్తానని వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంట్ అభ్యర్థి గూడూరి ఉమాబాల అన్నారు. వైఎస్సార్ సీపీ పాలకొల్లు కార్యాలయ ఆవరణలో సోమవారం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) ఆధ్వర్యంలో ఆసరా సంబరాలు నిర్వహించారు. ఈ సంబరాల్లో ఉమాబాల పాల్గొని మాట్లాడుతూ సాధారణ మహిళా ఉన్న తనకు అరుదైన అవకాశం లభించిందని, మహిళలంతా తన విజయంతో పాటు పార్టీ పాలకొల్లు అభ్యర్థి గుడాల గోపి విజయానికీ కృషి చేయాలని కోరారు. ఎంపీగా పోటీ చేసే అవకాశం పారిశ్రామికవేత్తలకు లేదా ఆర్థికంగా స్థిరపడ్డవారికి మాత్రమే అవకాశం కల్పిస్తారని, అయితే తొలిసారి సాధారణ మహిళకు కేటాయించి బహుజన కులాల పట్ల సీఎం జగన్‌కున్న ప్రత్యేక అభిమానాన్ని చాటుకున్నారని కొనియాడారు. మరింత సంక్షేమం కోసం జగన్‌ను మరలా ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. మాట తప్పని నేత జగన్ డ్వాక్రా మహిళలకు ఇచ్చిన హామీ మేరకు నాలుగు విడతలుగా డ్వాక్రా రుణ మాఫీ అమలు చేశారని గుడాల గోపీ అన్నారు. సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకూ సంక్షేమం అందించారని చెప్పారు. పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు పాలకొల్లు పట్టణంలో 2,500 మందికి పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించారన్నారు. అలాగే 6,144 మంది లబ్ధిదారులకు టిడ్కో గృహాలు అందించారని వివరించారు. జగన్ నాయకత్వాన్ని బలపరచాలని, ఎంపీగా ఉమాబాలను, పాలకొల్లు ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని గోపి మహిళలను అభ్యర్థించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు చందక సత్తిబాబు, రాష్ట్ర అర్బన్ అండ్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ వనుం సత్య కళ్యాణి, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పెదపాటి పెద్దిరాజు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి మద్దా చంద్రకళ, పార్టీ నాయకులు ఖండవల్లి వాసు, పట్టణ సచివాలయ కన్వీనర్ మోర్త గిరీష్, పట్టణ ఎస్టీ సెల్ అధ్యక్షుడు బండి రమేష్, పార్టీ యూత్ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి పెచ్చెట్టి కృష్ణాజీ తదితరులు పాల్గొన్నారు.

దశాబ్దాల సమస్యకు పరిష్కారం



మార్టేరులో దశాబ్దాల సమస్యలకు పరిష్కారం లభించింది. సీఎం జగన్ పాలనలో సంక్షేమంతో పాటు, గ్రామాలు అభివృద్ధి చెందాయి. దశాబ్దాలుగా మార్టేరులో బస్టాండ్ సమస్యతో ప్రయాణీకులు ఇబ్బందులు పడేవారు. మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు సొంత ఖర్చులతో బస్టాండ్ నిర్మించారు. ప్రభుత్వ నిధులతో అధునాతన సీఎస్ఎల్ నిర్మించారు.

–మట్టా కుమారి, సర్పంచ్, మార్టేరు

సొంతింటి కల నెరవేరింది



పేదల సొంతింటి కల నెరవేరింది. వైఎస్సార్ సీపీ పాలనలో ఇంటి స్థలాలు అందించడంతో పాటు, అభివృద్ధి చేసి చూపించారు. పెనుగొండలో కోడి పందేల దిబ్బ, నగరేశ్వర కాలనీల్లో మౌలిక సదుపాయాలు లేక ఇబ్బందులు పడేవారు. ఇప్పుడు రహదారులు, విద్యుత్ సదుపాయాలు కల్పించారు. మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు సొంత ఖర్చులతో తాగునీటిని అందిస్తున్నారు.

– కె.శ్రీలక్ష్మి, పెనుగొండ



పెనుగొండ : ఆత్మీయ విందును పర్యవేక్షిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు



పాలకొల్లు అర్బన్ : ఎంపీ అభ్యర్థి ఉమాబాలను సత్కరించిన వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గోపి దంపతులు



పాలకొల్లు అర్బన్ : మహిళలకు భోజనాలు వడ్డిస్తున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల గోపి

నేడు ఆసరా సంబరాలు

పాలకొల్లు అర్బన్: వైఎస్సార్ సీపీ స్థానిక కార్యాలయంలో మంగళవారం ఉదయం 10 గంటలకు పట్టణంలోని 9వ వార్డు నుంచి 16వ వార్డు డ్వాక్రా మహిళలకు ఆసరా సంబరాలు నిర్వహించనున్నట్టు పార్టీ పట్టణ అధ్యక్షుడు చందక సత్తిబాబు తెలిపారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో ఆయా వార్డు ఇన్‌చార్జీలు, డ్వాక్రా మహిళలు, పార్టీ శ్రేణులు పాల్గొనాలని ఆయన కోరారు.

వీర దుర్గమ్మకు వెండి సమర్పణ

పాలకొల్లు సెంట్రల్: స్థానిక రామారావుపేట కొత్త కాలనీ వీర దుర్గమ్మ ఆలయంలో అమ్మవారి మకర తోరణం నిమిత్తం దాత సినీ నిర్మాత బన్నీ వాసు 700 గ్రాముల వెండిని సమర్పించుకున్నారు. వాసు తరుపున వెండిని శిద్దిరెడ్డి అప్పారావు, తులా రామలింగేశ్వరరావు చేతులు మీదుగా ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. శిడగం సురేంద్ర, యర్రంశెట్టి నరసింహారావు, మానేపల్లి శ్రీధర్, బండారు రాజేష్, షేక్ వల్లి, కొప్పిశెట్టి నాగరాజు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

పెనుమంట్ర: పెనుమంట్ర, బ్రాహ్మణచెర్వు, వెలగలవారిపాలెం గ్రామాల్లో ఇటీవల మృతిచెందినవారి కుటుంబాలను మాజీ మంత్రి, ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు సోమవారం సాయంత్రం పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చి, ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని అన్నారు. వెలగలవారిపాలెంలో తేతలి పేర్రెడ్డి, సత్తి గంగాధరరెడ్డి, బ్రాహ్మణచెర్వులో వంటాకుల అప్పారావు, పెనుమంట్రలో రుద్రరాజు సత్యనారాయణరాజు చిత్రపటాలకు శ్రీరంగనాథరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వెలగలవారిపాలెంలో పేర్రెడ్డి మృతి పార్టీకి తీరనిలోటని ఆయన విచారం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కర్రి వెంకటనారాయణరెడ్డి, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు తాడిరాజారెడ్డి, పెనుమంట్ర, గరువు గ్రామ సర్పంచ్‌లు తాడిపర్తి ప్రియాంక, ముదునూరి నాగరాజు, ఉపసర్పంచ్ భూపతిరాజు శ్రీనివాసరాజు, ఎంపీటీసీ సభ్యులు మాంద్రు శాంతా వెంకటేష్, గండి రామారావు, చింతపల్లి మంగాదేవి, మండల యువజన విభాగం అధ్యక్షుడు కొవ్వూరి నాగరాజ మోహన్‌రెడ్డి, పెనుగొండ ఏఎంసీ మాజీ డైరెక్టర్ గాదిరాజు సాయిరామరాజు పాల్గొన్నారు.

ఎంపీపీ సుమంగళిసాగర్‌కు పరామర్శ

పోడూరు: స్థానిక ఎంపీపీ సబ్బితి సుమంగళి భర్త విద్యాసాగర్ ఇటీవల మృతిచెందడంతో సోమవారం పలువురు నాయకులు ఆమెను పరామర్శించారు. వీరిలో ఆచంట ఏఎంసీ చైర్మన్ చిల్లే లావణ్య, పెనుగొండ ఎంపీపీ పూతినీడి వెంకటేశ్వరరావు (పెద్ద), మార్టేరు ఎంపీటీసీ కర్రి అనురాధ, అరిగెల శ్రీను, అరిగెల సురేష్, నెగ్గిపూడి ఎంపీటీసీ పెనుగొండ లక్ష్మి తదితరులు ఎంపీపీ సుమంగళిని పరామర్శించారు.

నేడు శేరేపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష

మొగల్తూరు: మండలంలోని శేరేపాలెం గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం ఏర్పాటు చేస్తామని ఎంపీడీఓ వి.బాబ్జిరాజు తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రామంలోని వైఎస్సార్ ఆరోగ్య కేంద్రంలో శిబిరం కొనసాగుతుందని, మొగల్తూరు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులతో పాటు మరో ముగ్గురు స్పెషలిస్టు వైద్యులు వైద్య సేవలు అందిస్తారని పేర్కొన్నారు.

సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలి

నరసాపురం: విద్యార్థులు సమస్యలను ధైర్యంగా ఎదుర్కొని ముందుకు సాగాలని గోవా స్కూల్ ఆఫ్ బిజినెస్ మాజీ డీన్ ప్రొఫెసర్ బి.రమేష్ సూచించారు. సోమవారం వైఎన్ కళాశాలలో ఎంబీఏ, ఎంసీఏ విభాగాల వారికి వృత్తిపరమైన నైపుణ్యాలు ఎలా పెంచుకోవాలి అనే అంశంపై ఏర్పాటుచేసిన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థులు కెరీర్‌లో స్థిరపడాలంటే పాజిటివ్ థింకింగ్‌తో ముందుకెళ్లాలని, సోషల్ ఇంటిలిజెన్స్, ఎమోషనల్ ఇంటిలిజెన్స్ చాలా కీలకమని తెలిపారు. కళాశాల పీజీ కోర్సుల ఇన్‌చార్జి డైరెక్టర్ ఆర్ పార్థసారధి, ఎంసీఏ హెడ్ సీహెచ్ లక్ష్మి, హెచ్ఆర్డీ సెంటర్ డైరెక్టర్ చినిమిల్లి శ్రీనివాస్, గంధం శ్రీరామకృష్ణ పాల్గొన్నారు.

శ్రీరంగనాథరాజును కలిసిన అధికారులు





శ్రీరంగనాథరాజును కలిసిన ఎస్సైలు, తహసీల్దారు

పెనుగొండ: పెనుగొండ, పెనుమంట్ర ఎస్సైలుగా బాధ్యతలు స్వీకరించిన షేక్ సుభానీ, సురేంద్రబాబులు సోమవారం తూర్పుపాలెంలో మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజును మర్యాద పూర్వకంగా కలిశారు. ఎస్సై షేక్ సుభానీ తూర్పుగోదావరి జిల్లా సమిశ్ర గూడెం నుంచి బదిలీపై వచ్చారు. పెనుగొండ తహసీల్దార్‌గా ఆర్‌వీవీ రోహిణీ దేవి బాధ్యతలు స్వీకరించారు. తూర్పుపాలెంలో శ్రీరంగనాథరాజును మర్యాద పూర్వకంగా కలిశారు. రోహిణీదేవి కృష్ణా జిల్లా జి.కొండూరు నుంచి బదిలీపై వచ్చారు.

పాలకొల్లు ఎంపీడీఓగా అనుపమ



అనుపమ

పాలకొల్లు అర్బన్: పాలకొల్లు ఎంపీడీఓగా మట్టపర్తి అనుపమ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనుపమ కాకినాడ జిల్లా తాళ్లరేవు నుంచి వచ్చారు. ఈ సందర్భంగా అనుపమను పంచాయతీరాజ్ ఏఈ కె.సామ్యూల్, ఈవోపీఆర్‌డీ కేఎం వైభవతి, ఏఓ గోవిందరాజులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు.

పోడూరు తహసీల్దార్‌గా మురళీకృష్ణ



మురళీకృష్ణ

పోడూరు: పోడూరు తహసీల్దార్‌గా బీబీవీ మురళీకృష్ణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం ఆర్డీఓ కార్యాలయంలో ఏఓగా పనిచేస్తూ ఆయన ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఆర్‌వీ కృష్ణారావు తూర్పుగోదావరి జిల్లా రాయవరం బదిలీ అయ్యారు. మురళీకృష్ణ తూర్పుపాలెం క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజును మర్యాదపూర్వకంగా కలిశారు.

పాలకొల్లు తహసీల్దార్‌గా మధుసూదనరావు



మధుసూదనరావు

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు తహసీల్దార్‌గా పి.మధుసూదనరావు బాధ్యతలు స్వీకరించారు. కృష్ణా జిల్లా పెడన నుంచి ఆయన బదిలీపై వచ్చారు. కృష్ణా జిల్లా కృత్తివెన్ను, మండవల్లి, తూర్పుగోదావరి జిల్లా కోటనందూరు మండలాల్లో ఆయన పనిచేసినట్టు చెప్పారు. ఆయనకు కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలిచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

మొగల్తూరు ఎస్సైగా వెంకటరమణ



వెంకటరమణ

మొగల్తూరు: మొగల్తూరు ఎస్సైగా కె.వెంకటరమణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. 2012 బ్యాచ్‌కు చెందిన వెంకటరమణ తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఎం వీరబాబు స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీ అయ్యారు.

బీసీ కుల గణన చేపట్టాలి

పాలకొల్లు అర్బన్: రాష్ట్రంలో బీసీ కుల గణన చేపట్టిన మాదిరిగానే.. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో బీసీ కుల గణన చేపట్టాలని బీసీ ప్రజా సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు గూడూరి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. పాలకొల్లు మండలం పూలపల్లి గౌడ, శెట్టిబలిజ కమ్యూనిటీ భవనంలో సోమవారం ఏర్పాటుచేసిన సంఘ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో నియమించిన బీసీ కమిషన్‌కు రాజ్యాంగ హోదా కల్పించాలని కోరారు. బహుజన కులాల నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపరచాలన్నారు. యువత, మహిళలు ప్రజా సంఘాల్లో చురుకైన పాత్ర పోషించడానికి ముందుకు రావాలని కోరారు.

పట్టణ, మండలాల కమిటీల ఎంపిక

ఈ సందర్భంగా పట్టణ, మండలాల కమిటీలను వెంకటేశ్వరరావు ప్రకటించారు. బీసీ ప్రజా సంక్షేమ సంఘం పాలకొల్లు నియోజకవర్గ అధ్యక్షుడిగా గానుబోయిన దుర్గారావు, ప్రధాన కార్యదర్శిగా గుబ్బల నాగేశ్వరరావు, గౌరవాధ్యక్షుడిగా బొక్కా గంగాధరరావు, ఉపాధ్యక్షుడిగా ధనకొండ సత్యనారాయణ, సహాయ కార్యదర్శిగా వాసా చినకోట గణేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడిగా కాండ్రేకుల సత్యనారాయణ, పాలకొల్లు మండల అధ్యక్షుడిగా కుక్కల సత్యనారాయణ, మండల ఉపాధ్యక్షుడిగా కట్టా సునీల్‌కుమార్, మహిళా విభాగం పట్టణ అధ్యక్షురాలుగా ముంగండ సురేఖ, ఉపాధ్యక్షురాలుగా గౌరీలను నియమించారు. వీరికి నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు దొంగ కృష్ణ, చిప్పాడ చంద్రశేఖర్, మల్లుల వరలక్ష్మి, ముబీనా, జిల్లా అధ్యక్షుడు కుక్కల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి కండిబోయిన సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చేయడం నేరం

పాలకొల్లు అర్బన్: బాల్య వివాహాలు చేయడం శిక్షార్హమని ఐసీడీఎస్ పాలకొల్లు ప్రాజెక్టు సూపర్‌వైజర్ ఎస్ మంగ అన్నారు. గవరపేట అంగన్‌వాడీ కేంద్ర ఆవరణలో సోమవారం బేటీ బచావో.. బేటీ పఢావో కార్యక్రమంపై అవగాహన కల్పించారు. గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేటి సూర్యనారాయణ, ఎంపీటీసీ దొడ్డి ధనలక్ష్మి, మహిళా పోలీస్ శ్రీలత, ఏఎన్ఎం దుర్గ తదితరులు పాల్గొన్నారు.

11న కర్ణభక్త సమాజం సమావేశం

పాలకొల్లు సెంట్రల్: స్థానిక అద్దేపల్లి వారి సత్రంలో ఈనెల 11న ఉదయం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు సంఘ కార్యదర్శి శాగా రాంబాబు తెలిపారు. మహాశివరాత్రి సందర్భంగా శ్రీ భ్రమరాంభ మల్లికార్జున స్వామి వార్ల బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని భక్తుల సౌకర్యార్థం కర్ణభక్త సమాజ సంక్షేమ కమిటీ శ్రీశైలం సత్రం వద్ద చేసే ఏర్పాట్లపై చర్చిస్తామన్నారు.


సంఘం భవనానికి స్థలం కేటాయింపు



మాట్లాడుతున్న గుడాల గోపి

యలమంచిలి: ధన్వంతరి మెడికల్ షాప్స్ అసోసియేషన్ సంఘ భవనానికి అవసరమైన స్థలాన్ని మేడపాడు గ్రామంలో కేటాయించినట్టు వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) చెప్పారు. సంఘ మండల అధ్యక్షుడు కుమ్మరిపురుగు సూర్యనారాయణ ఇంటి వద్ద సోమవారం ఏర్పాటుచేసిన సంఘ సమావేశంలో గోపి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కేటాయించిన స్థలంలో భవన నిర్మాణం ప్రారంభిస్తే ఎన్నికల అనంతరం రూ.25 లక్షలు వరకు నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు తటవర్తి కృష్ణమూర్తి మాట్లాడుతూ దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పాలకొల్లు ఎమ్మెల్యే బంగారు ఉషారాణి పాలకొల్లులో స్థలం కేటాయిస్తే భవనం నిర్మించామని గుర్తుచేశారు. ఇప్పుడు యలమంచిలి మండలంలో కూడా స్థలం కేటాయించినందుకు ధన్యవాదాలు తెలిపారు. పనిచేసే ప్రభుత్వానికి సంఘం తరఫున కూడా తమవంతు సహకారం అందిస్తామని చెప్పారు. భవన నిర్మాణం పూర్తయ్యాక ఏటా పేదలకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తామని కృష్ణమూర్తి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ రావూరి వెంకటరమణ బుజ్జి, పాలకొల్లు ఏఎంసీ డైరెక్టర్ గుర్రాల వెంకట్రావు, మాజీ సర్పంచ్ అడ్డాల వాసుదేవరావు, రావూరి వెంకట కోటి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జిన్నూరు సొసైటీ చైర్మన్‌గా అప్పాజీ



జక్కంశెట్టి అప్పాజీ

పోడూరు: జిన్నూరు సొసైటీ చైర్మన్‌గా జక్కంశెట్టి అప్పాజీ నియమితులయ్యారు. సోమవారం ఆయన సొసైటీలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. తనకు పదవి ఇవ్వడం పట్ల వైఎస్సార్ సీపీ పాలకొల్లు ఇన్‌చార్జి గుడాల గోపికి, ఏఎంసీ వైస్ చైర్మన్ డీటీడీసీ బాబుకు, గ్రామ సర్పంచ్ జమ్ము బేబీ మహాలక్ష్మికి కృతజ్ఞతలు తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన అప్పాజీని గ్రామసర్పంచ్ జమ్ము బేబీ మహాలక్ష్మి, ఏఎంసీ వైస్ చైర్మన్ డీటీడీసీ బాబు, ఏఎంసీ డైరెక్టర్ జమ్ము బుజ్జి, సొసైటీ కమిటీ సభ్యులు గోగులమండ విజయాదేవి, పెచ్చెట్టి ముత్యాలరావు, సీఈఓ పెచ్చెట్టి రామకృష్ణ, వైఎస్సార్ సీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు భూపతిరాజు సూర్యరాజు, కార్యదర్శి మీసాల దాన వెంకట నర్సింహులు, ఎంపీటీసీ కడలి సూర్యచంద్రరావు, రెడ్డి అంజిబాబు, చినబాబు, చింతపల్లి రాధాకృష్ణ తదితరులు అభినందించారు.